కేంద్రాల్లోనే ధాన్యం.. రైతన్న దైన్యం

- లారీలు రాక, గోనె సంచుల కొరతతో నత్తనడకన కొనుగోళ్లు
- నంది మేడారం కేంద్రంలో భారీగా పేరుకు పోయినవడ్ల నిల్వలు
- వరుసగా కురుస్తున్న వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- ఆందోళనలో రైతులు

నంది మేడారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన చెందుతున్న రైతులు

ధర్మారం, మే 17 : ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు నత్తనడకన కొనసాగుతుండడంతో వర్షానికి తడిసిపోతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. ధర్మారం మండలంలో గత ఏప్రిల్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నంది మేడారం సింగిల్ విండో పరిధిలో 18 కేంద్రాలు, పత్తిపాక సింగిల్ విండో పరిధిలో 6 కేంద్రాలు, సెర్ప్ ద్వారా 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు రెండు నెలలు కావస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడం లేదు. నంది మేడారం సింగిల్ విండో పరిధిలో రామయ్యపల్లి, దొంగతుర్తి, నర్సింహులపల్లి, కానంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయి. పత్తిపాక విండో పరిధిలోని నర్సింగాపూర్, పత్తిపాక, మల్లాపూర్, కమ్మర్‌ఖాన్‌పేట, లంబాడీతండా(బి), అబ్బాపూర్ గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తి కాలేదు. ధాన్యం కొనుగోళ్లు చేస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు. సెర్ప్ పరిధిలో 3 కేంద్రాలు ఏర్పాటు చేయగా రచ్చపల్లి కేంద్రంలో కొనుగోళ్లు చివరి దశలో ఉన్నాయని ఏపీఎం తులసీ మాత తెలిపారు. ఇంకా కొత్తూరు, కటికెనపల్లి గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తి కాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల10న 4.5 మి.మీ, 16న 21.4 మి.మీ, 17న (శుక్రవారం) 9.4 మి.మీ వర్షం కు రిసింది. ఓవైపు అకాల వర్షాలు, మరోవైపు కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కేంద్రాలకు సరిపడా లారీలు రాకపోవడం, తగినన్ని గోనె సంచులు అందుబాటులో లేకపోవడంతో వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్ర, శనివారాల్లో వానలు కురువడంతో ధాన్యం మొలకెత్తి నష్టపోతామని వారు వాపోతున్నారు. నంది మేడారం లోని కొనుగోలు కేంద్రంలో భారీగా ధాన్యం పేరుకు పోగా నిలిచిన వర్షపు నీటిని రైతులు తొలిగించారు. లారీలు, గోనె సంచులు పంపించి ధాన్యం కొనాలని రైతులు కోరుతున్నారు.

బీపీని నియంత్రించుకోవాలి

- డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్
- కలెక్టరేట్ ఉద్యోగులకు బీపీ చెకప్

పెద్దపల్లి: అవగాహన ర్యాలీ తీస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, వైద్య సిబ్బంది

పెద్దపల్లి, మే 17: ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకొని రక్తపోటును (బీపీ) నియంత్రణలో ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్ సూచించారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి యూపీహెచ్‌సీ నుంచి కమాన్ కూడలి వరకు ర్యాలీ తీశారు. కలెక్టరేట్‌లో ఉద్యోగులందరికీ బీపీ చెకప్ చేసి, మందులు అందించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, 30 ఏళ్లు దాటిన వాళ్లందరూ రక్తపోటు పరీక్షలను క్రమంగా చేయించుకోవాలని తెలిపారు. ఇక్కడ అధికారులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

గోదావరిఖని, మే 17: ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా గోదావరిఖని సింగరేణి ఏరియా దవాఖానలో దవాఖాన డిప్యూటీ సీఎంవో డాక్టర్ ఆర్ కిరణ్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరియా డాక్టర్ సుమన్ దవాఖానకు కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అధిక రక్తపోటు లక్షణాలు, నియంత్రణ చర్యలను వివరించారు. ఇక్కడ దవాఖాన డిప్యూటీ సీఎంవో డాక్టర్ అంబిక, డాక్టర్ రవి, డాక్టర్ భాస్కర్, మురళి, ప్రశాంత్ ఉన్నారు.

ఎలిగేడు, మే 17: ప్రపంచ అధిక రక్తపోటు దినం సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టినా ఆధ్వర్యంలో వైద్యబృందం అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. అధిక రక్తపోటు వల్ల కలిగే రుగ్మతలు, జాగ్రత్తలపై వివరించారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి బీపీ, షుగర్ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఇక్కడ హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరీదేవి, సూపర్‌వైజర్లు, వైద్యారోగ్య సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, మే17: జూన్ 7లోగా బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి పెద్దపల్లి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్ & నాన్ రెసిడెన్షియల్) కింద పాఠశాలల్లో ఒకటో తరగతి (నాన్ రెసిడెన్షియల్)లో 70 సీట్లు, 5వ, తరగతి (రెసిడెన్షియల్)లో 73 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని, లాటరీ పద్ధతిన, రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. దరఖాస్తులు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో లభిస్తాయన్నారు. దరఖాస్తులను తగిన ధ్రువీకరణ పత్రాలతో జూన్ 7 సాయంత్రం 5 లోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. జూన్ 11న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని, తెలిపారు. వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, సెల్: 9010136407, 9908261045లలో సంప్రదించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఓదెల, మే 17: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో సందర్శించారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓపీ, దవాఖానకు ఎలాంటి వ్యాధిగ్రస్తులు వస్తారనే విషయాలను తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందేలా చూడాలన్నారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారులు మధుకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, దేవీసింగ్, వైద్యాధికారి షహబాజ్‌ఖాన్, సిబ్బంది ఉన్నారు.

బహిరంగ వేలం

కోల్‌సిటీ, మే 17 : గోదావరిఖనిలోని శ్రీ కోదండ రామాలయంలో ఈనెల 20న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఎం.శంకరయ్య ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలోని గదులను మూడు సంవత్సరాల కాల పరిమితితో లీజు పద్ధతిలో అద్దెకు ఇవ్వడానికి టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు నిర్దేశిత డిపాజిట్ రుసుంతో 22న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు టెండర్ బాక్సులో ఫారాలు వేయాలని, అదే రోజున గదులు కేటాయించనున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో కటింగ్ లేకుండా చూడాలి

ఓదెల, మే 17: ధాన్యం కొనుగోళ్లలో కటింగ్ లేకుండా చూస్తానని ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు. కొలనూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే సందర్శించారు. స్థానిక రైతులు పల్లె సారయ్య, కల్లెపల్లి సంపత్ తనకు ఉదయం ఫోన్ చేసి వర్షానికి తడిసిన ధాన్యం కొనుగోలు చేసే విధంగా చూడాలని కోరడంతో కొలనూర్ కొనుగోలు కేంద్రానికి వచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ సుమన్‌రెడ్డి, మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులున్నారు.

మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత

పెద్దపల్లి, మే17: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, మహిళా సాధికారత సాధించడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా మహిళా సాధికారత ఫైనాన్షియల్ లిట్రసీ సేరు సంధ్య అన్నారు. శుక్రవారం వివేకానంద ఇన్స్టిట్యూషన్ ఆఫ్ కంప్యూటర్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళా చట్టాలు, అన్యాయాలపై మహిళలకు వివరించారు. వివిధ రకాల లోన్స్, అగ్రికల్చర్ లోన్స్‌పై అవగాహన కల్పించారు. ఇక్కడ గన్నబోయిన నరసింహం, పులి శ్రీకాంత్, వెన్నెల ఉన్నారు.

పారిశుధ్యం పై దృష్టి సారించాలి

పెద్దపల్లిరూరల్, మే 17: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్పీవో వేణుగోపాల్ సూచించారు. మండలంలోని కొత్తపల్లి, మూలసాల గ్రామాలను డిఎల్‌పివొ వేణుగోపాల్ సందర్శించి పారిశుధ్యం, మంచినీటి సమస్యలను పరిశీలించారు. గ్రామస్తులకు మంచినీరు, పారిశుధ్యం విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్
- సమ్మర్ క్యాంపు విద్యార్థులతో మాటామంతీ

పెద్దపల్లి కమాన్: విద్యార్థులతో ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి కమాన్, మే 17 : విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. పెద్దపల్లి పట్టణంలోని అమర్‌నగర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును శుక్రవారం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సందర్శించారు. సెలవుల్లో ఆటాపాటలతో పాటు చదువు నేర్చుకోవాలనే ఉద్దేశంతో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులతో ముచ్చటించి, పెద్దయ్యాక ఏం అవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. చిన్నతనం నుంచే పిల్లలు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. ఇక్కడ జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, సమ్మర్ క్యాంపు వలంటీర్ మితేష్ సింగ్, చిన్నారులు, తల్లిదండ్రులు ఉన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

కేంద్రాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యాసంగికి సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై అదనపు కలెక్టర్లు జే అరుణ శ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి కలెక్టర్, అధికారులు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 2,39,209 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అధికారులు పేర్కొన్నారు. 2,37,760 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు తరలించామని 1,449 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్నదని అధికారులు వివరించారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని, ఎటువంటి కోత విధించడానికి వీల్లేదని రైస్ మిల్లర్లకు సూచించారు. సమావేశంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీవో రవీందర్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, కాంట్రాక్టర్లు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాబోయే వానకాలంలో విత్తన విక్రయ ప్రక్రియ, నకిలీ విత్తనాల నిర్మూలన తదితర అంశాలపై జిల్లాలోని విత్తన డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే విత్తనాలు అమ్మాలని తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి జిల్లా స్థాయిలో పోలీస్, వ్యవసాయ, విత్తన ధ్రువీకరణ సంస్థల అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఏసీపీ గజ్జి కృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, వ్యవసాయ శాఖాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

జ్యోతినగర్, మే 17: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని అందుకు వారికి తగిన తోడ్పాటును అందించాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ అందిస్తున్న బాలికల సాధికారిక మిషన్ వర్క్ షాప్‌లో భాగంగా శుక్రవారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వేదికపై కలెక్టర్ బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. తమ కుటుంబంలో మా అమ్మమ్మ అమ్మను చదివించడంతో మా కుటుంబంమంతా బాగుపడిందన్నారు. అనంతరం కలెక్టర్ శిక్షణ బాలికలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు, జీఎంలు అలోక్‌కుమార్ త్రిపాఠి, అర్పన్ దాసుగుప్తా, సంజీవ్‌కుమార్ సహా, వేముల అనిల్‌కుమార్, మోహన్‌రెడ్డి, కేసీ సింగరాయ్, ఏజీఎం హెచ్‌ఆర్ బిజోయ్‌కుమార్ సిక్దర్, సీఎస్ఆర్ డీజీఎం చౌదరి, యుగేందర్‌రావు ఉన్నారు.

పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

మంథని: మాట్లాడుతున్న మంథని ఆర్డీవో హనుమా నాయక్

మంథని, మే 17: పన్నూరు, రత్నాపూర్ గ్రామాల్లోని ఆర్‌అండ్ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని లద్నాపూర్ భూ నిర్వాసితులు, మంథని ఆర్డీవో హనుమా నాయక్‌ను కోరారు. శుక్రవారం ఆర్డీవో తన కార్యాలయంలో లద్నాపూర్ గ్రామ సింగరేణి భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు తమకు కేటాయించిన ఆర్‌అండ్ఆర్ కాలనీలో సమస్యలను విన్నవించారు. ఆర్డీవో మాట్లాడుతూ, పన్నూరు, రత్నాపూర్ ఆర్‌అండ్ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సింగరేణిదేనని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం చేయాల్సిన పనులను త్వరగా పూర్తి చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. సమావేశంలో రామగిరి తహసీల్దార్ బీ రామచందర్, సింగరేణి అధికారులు జీ రఘుపతి, లక్ష్మీనారాయణ, రాజేందర్, ఐలయ్య, శ్యామల, లద్నాపూర్ ఆర్‌అండ్ఆర్ కమిటీ సభ్యులు, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

పెద్దపల్లి, మే17: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతులను వచ్చే నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సీఎస్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్లు జే.అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, సంబంధిత అధికారులు వీసీలో పాల్గొన్నారు. వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక సదుపాయాలైన టాయిలెట్లు, తాగునీరు పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి, సకాలంలో రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తయిందని, త్వరితగతిన డెలివరీ పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఆర్డీవో హనుమా నాయక్, బీ గంగయ్య, డీఈవో డీ మాధవి, డీఆర్డీవో రవీందర్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సీపీవో గంప రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

గోదావరిఖని/కోల్‌సిటీ, మే 17: పట్టణంలోని 42వ డివిజన్‌లో డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ శుక్రవారం కొత్తగా ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఇక్కడ ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్, ఏఈ సంపత్, లైన్‌మన్ ఆర్ శ్రీనివాస్, డివిజన్ వాసులు రమేశ్, నారాయణ, కృష్ణమాచారి, బ్రహ్మం శ్రీనివాస్, రాజయ్య, సమ్మయ్య, సాయి మహేందర్, రమేశ్, మొగిళి, గట్టయ్య, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

జ్యోతినగర్, మే 17: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను శుక్రవారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని వీఐపీ గెస్ట్‌హౌస్‌లో ఐపీఎఫ్ పాస్టర్స్ ఘనంగా సన్మానించారు. ఎస్సీ కమిషన్ సభ్యుడిగా ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ శాలువాలతో సత్కరించారు. ఇక్కడ ఐపీఎఫ్ మాజీ అధ్యక్షుడు రెవ. డా.ఎం ప్రకాశ్, మాజీ ప్రధాన కార్యదర్శి పాస్టర్ జీ థామస్, పాస్టర్స్ పీ ఇశ్రాయేలు, ఏపీ నెల్సన్, స్వామిదాస్,ఎలీషా ఉన్నారు.

సమ్మెలో పాల్గొనవద్దు

రామగిరి, మే 17 : సింగరేణి భూ నిర్వాసితుల వాహన యాజమానులు సమస్యల పరిష్కారానికి ఈనెల 20 నుంచి సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆర్జీ-3,ఏపీఏ యాజమాన్యం అద్దె వాహన యజమానులతో శుక్రవారం జీఎం కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎస్‌సుధాకర్‌రావు మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వాహన యజమానులు సమ్మెలో పాల్గొనడం చట్ట వ్యతిరేకమని, కావున సమ్మెలో పాల్గొనకూడదని తెలిపారు. ఇక్కడ ఎస్‌వోటూ జీఎం రఘుపతి, సత్యనారాయణ, ఏజీఎం శ్రీనివాస్, అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, రమేశ్, అద్దెవాహన యజమానులు ఉన్నారు.

మజ్జిగ పంపిణీ

గోదావరిఖని, మే 17: మార్కండయకాలనీలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధన గురుపూజ మహోత్సవానికి వచ్చిన భక్తులకు ముబీన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిక, పండ్ల రసాలను పంపిణీ చేశారు. ఇక్కడ ముస్లింలు ముబీన్, నాజీమొద్దీన్, అబిద్, సిరాజ్, సర్వర్, జాహిద్ బేగ్, రియాజ్, సయీఫ్, పురాంఘన్, సను, ఖాజా, అక్రమ్ ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

యైటింక్లయిన్‌కాలనీ: బహుమతి అందుకుంటున్న బాలుర జట్టు

యైటింక్లయిన్‌కాలనీ మే 17 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని గోదావరిఖని ఏసీపీ రమేశ్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీలోని అబ్దుల్ కలాం క్రీడా మైదానంలో నిర్వహించిన డార్జ్‌బాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం ఆయన ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణతో కలిసి బహుమతులు అందజేశారు. ఇక్కడ క్రీడల రాష్ట్ర కార్యదర్శి పాశం శ్రీనివాస్, నర్సింహారెడ్డి, కార్పొరేటర్ శంకర్ నాయక్, పాశం ఓదెలు, టూటౌన్ సీఐ రవీందర్ తదితరలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్

జూలపల్లి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న డీసీవో శ్రీమాల

జూలపల్లి, మే 17 : జూలపల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అధికారులు సందర్శించారు. నమస్తే తెలంగాణ దిన పత్రికలో శుక్రవారం 'ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..ఆందోళనలో రైతులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ క్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం శ్రీకాంత్, జిల్లా సహకార సంఘం డీసీవో శ్రీమాల రైతులతో నేరుగా మాట్లాడారు. ఇప్పటిదాకా ధాన్యం సేకరణ, డబ్బుల చెల్లింపులు, తూకం నిల్వలు అడిగి తెలుసుకున్నారు. సివిల్ సప్లై డీటీ శంకర్ కుమ్మరికుంటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల ఇబ్బందులు, కొనుగోళ్ల తీరును పరిశీలించారు. లారీలు, హమాలీల కొరత తీర్చి కొనుగోళ్లు వేగవంతం చేస్తామని భరోసా కల్పించారు. రైతులు ఆందోళన చెందవద్దని, జాప్యం లేకుండా ధాన్యం తూకం వేయిస్తామని పేర్కొన్నారు. అలాగే ఇక్కడి అధికారులతోపాటు, విండో సీఈవో గీస సురేశ్‌ను జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఫోన్ ద్వారా సంప్రదించి కొనుగోళ్ల తీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని విధాలా సహరిస్తామని తెలిపారు.

చీరెల పంపిణీ

జ్యోతినగర్, మే 17: వరల్డ్ మదర్స్‌డేను పురస్కరించుకొని శుక్రవారం ఎన్టీపీసీ పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో ఎస్‌బీఐ లింగాపూర్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సాత్విక్, క్యాషియర్ శ్వేత, సింగరేణి ఉద్యోగి శ్రీనివాస్ సహకారంతో ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, ఫర్కెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు కాలనీ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇక్కడ యాదవ సంఘం నాయకులు కిశోర్ యాదవ్, స్వప్నమహేశ్ ఉన్నారు.

మద్యం మత్తులో భార్యపై దాడి

- ఆపై బ్లేడ్‌తో కోసుకున్న ప్రబుద్ధుడు

యైటింక్లయిన్‌కాలనీ, మే 17: మద్యం మత్తులో భార్యపై దాడి చేసిన భర్త..ఆపై బ్లేడ్‌తో చెయ్యిని కోసుకున్నాడు. శుక్రవారం యైటింక్లయిన్‌కాలనీలో జరిగిన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి ఆర్జీ-2 ఏరియాలోని ఓ అధికారి ఇంట్లో శ్రీనివాస్‌స్వప్న దంపతులు నివసిస్తున్నారు. శ్రీనివాస్ నిత్యం మద్యం తాగొచ్చి భార్యను వేధించేవాడు. శుక్రవారం మద్యంమత్తులో పద్మపై దాడి చేశాడు. ఆపై తన చెయ్యిని కోసుకున్నాడు. అక్కడ పని చేస్తున్న ప్రైవేట్ కార్మికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఖని సీఐ రవీందర్ ఆదేశాలతో బ్లూకోల్ట్స్ సిబ్బంది చేరుకొని గాయపడ్డ భార్యాభర్తలను దవాఖానకు తరలించారు.

ఆటో బోల్తాపడి ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

రాజు (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే17: మండలంలోని ఇద్లాపూర్-పెద్దరాత్‌పల్లి గ్రామాల మధ్య మట్టలవాగు బ్రిడ్జివద్ద ఆలో బోల్తాపడి ఇందుర్తి గ్రామానికి చెందిన చెలుకాని రాజు (32) అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఇందుర్తి గ్రామానికి చెందిన చెలుకాని రాజు, బీస రజిత కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇద్లాపూర్‌లో గురువారం జరిగిన వారసంతలో కూరగాయలు అమ్ముకొని స్వగ్రామానికి బయలుదేరారు. అర్ధరాత్రి తిరుగు ప్రయాణంలో పెద్దరాత్‌పల్లి మట్టలవాగు బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు ఆటో(నెంఏపీ 15 టీబీ 6153) అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడిక్కడే మృతి చెందగా, బీస రజిత చెయ్యి విరిగింది. ప్రయాణికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ ఓంకార్ యాదవ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించారు. రాజుకు భార్య భవాని, కొడుకు, కూతురు ఉన్నారు. రాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ ఆటో డ్రైవర్ మృతి

పెద్దపల్లి రూరల్, మే 17: పెద్దపల్లి మండలంలోని పాలితం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆలేటి భూమయ్య (42) ప్రమాద వశాత్తు ఆటో బోల్తాపడ్డ సంఘటనలో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన భూమయ్య సాయత్రం ప్రయాణికులు ఎవరూలేక పోవడంతో ఇంటికి ఖాళీగా వెళ్తుండగా,గ్రామశివారులో విపరీతమైన గాలికి ఆటో బోల్తాపడ్డది. గాయపడిన అతడిని బంధువులు చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. భూమయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగులకు నెల వేతనం ఇప్పించాలి

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శంకర్
- కలెక్టర్‌కు అభినందన

కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శంకర్

పెద్దపల్లి, మే17: ఎలక్షన్ విధుల్లో పాల్గొన్న ఉద్యోగులందరికీ ఒక నెల వేతనాన్ని ఇప్పించాలని కలెక్టర్ ముజామ్మిల్‌ను టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ కోరారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడంపై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ టీఎన్జీవో ఉపాధ్యక్షుడు, కొమురయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహేందర్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు సురేష్, అర్బన్ కార్యదర్శి ప్రవీణ్, శ్రీనివాస్ గౌడ్, రాజేష్, రత్నం ఉన్నారు.

తాగునీరు, పారిశుధ్యంలో ఇబ్బంది కలుగవద్దు

పెద్దపల్లి రూరల్, మే 17: తాగునీరు, పారిశుధ్యం విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. మండలంలోని రాఘవాపూర్‌లో శుక్రవారం పర్యటించి పారిశుధ్యం, మంచినీటి అవసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, మంచినీటి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యాన్ని వీడాలని సూచించారు. నర్సరీల్లో మొక్కలు ఎండి పోకుండా ట్యాంకర్లతో నీరు పోసి మొక్కలను కాపాడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, బిల్ కలెక్టర్ అహ్మదీ బేగం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
★Peddolla Raju, S/o. Rajaiah, H.No. 7-20/1, Nizamabad V/o Konaraopet Mandal, Rajanna Sircilla Dist. my surname was changed as Thallapelly Raju S/o Rajaiah.
NTK-000

CHANGE OF NAME
★I, MEENA RAVI S/o. KISHTAIAH, M.A.B.Ed., School Assistant, shall henceforth be known as SRI MEESA RAVI S/o. KISHTAIAH, for the purpose of correction wrong entries occurred in school records due to parental mistake.
NTK-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194